


శ్రీ కోదండరామాలయం, ఒంటిమిట్ట, కడప జిల్లా




"పలికెడిది భాగవతమఁట
పలికించు విభుండు రామభద్రుండఁట; నేఁ
పలికిన భవహర మగునట;

పలికెద వేఱొండుగాథఁ బలుకఁగ నేలా?"

ఈ పద్యం "పోతన" గారు తెలుగులో రచించిన "భాగవతం"లోనిది. శ్రీరాముని ఆనతిమేరకే తాను ఈ భాగవతాన్ని తెలుగులో రచించానని పోతన చెప్పారు.

ఈ పద్యంలో పోతనగారు ప్రస్థావించిన రాముడు ఈ "ఒంటిమిట్ట కోదండరాముడే".

ఆ మహాకవి పోతనగారి "భాగవతం" పుట్టింది ఈ "ఒంటిమిట్ట" లోనే.

పోతనగారికి ధ్యానంలో దర్శనమిచ్చింది ఈ "ఒంటిమిట్ట కోదండరాముడే".

పోతనగారు వారి భాగవతాన్ని అంకితమిచ్చింది ఈ "ఒంటిమిట్ట కోదండరాముడికే"

ఈ ఆలయ ముఖమండపం నుండి గర్భాలయానికి వెళుతున్నప్పుడు ద్వారానికి బయటివైపునే కుడివైపుగా పోతనగారి విగ్రహం ఉంది.

ఇంతటి ప్రాశస్త్యం ఉన్న ఈ "ఒంటిమిట్ట కోదండరామాలయం" మరెన్నో పౌరాణిక, చారిత్రక విశేషాలకు నెలవు. పరంపరాగతంగా వస్తున్న మరెన్నో స్థలపురాణాలు, జానపదుల కథలు, మహిమాలూ యధావిధిగా ఉండనే ఉన్నాయి. "తాళ్ళపాక అన్నమయ్య" ఈ ఆలయాన్ని సందర్శించి, కీర్తనలు కూడా రాశారు. "పోతులూరి వీరబ్రహ్మం" గారు కూడా ఈ ఆలయాన్ని దర్శించినట్లు చెబుతారు.

### *పౌరాణికంగా చూస్తే...*

ఈ గ్రామం త్రేతాయుగం నాటిదని స్థలపురాణం ద్వారా తెలుస్తున్నది. గర్భాలయంలో సీతాలక్ష్మణ సమేతంగా ఉన్న రాముడిని ఏకశిలపై మలిశారు. ఈ ఆలయంలో మూలమూర్తి దగ్గర హనుమంతుడు లేకపోవడం ప్రత్యేకత. మనదేశంలో ఇంకెక్కడా ఆంజనేయుడు లేని ఇలాంటి రామాలయం లేదు. దీనికీ మరో కథనం ప్రచారంలో ఉంది. ఆంజనేయుడికంటే జాంబవంతుడు పెద్దవాడు కావడం వల్లనూ, శ్రీరామునికి ఆంజనేయుడు పరిచయం కాకముందే జాంబవంతుడు ఈ విగ్రహాలను ప్రతిష్ఠ చేశారనీ, అందువల్లే ఇక్కడ ఆంజనేయుడి మూర్తి ఉండదనీ చెబుతారు.

అసలు త్రేతాయుగంలో ఈ ప్రాంతం తపోవనంగా ఉండేదట.! మహర్షులు తలపెట్టిన యాగాన్ని రాక్షసులు ఆటంకపరుస్తూ ఉండడం వల్ల వారి వినతి మేరకు, శ్రీరాముడు వచ్చి యాగరక్షణ చేశాడట.!

ఇలాంటి ఎన్నో లెక్కలేనన్ని కథలు ప్రచారంలో ఉన్నాయి.

అరణ్యవాసం చేస్తున్న కోదండరాముడే ఈ ఒంటిమిట్టలో కొలువైన రఘునాయకుడు. "జాంబవంతుడు" రాముడికి అరణ్యవాస సమయంలో పరిచయమైన ముఖ్యుల్లో ఒకరు. ఇతనే ద్వాపరయుగంలో శ్రీకృష్ణుడికి తన కూతురైన "జాంబవతి"నిచ్చి అల్లుడిగా చేసుకొన్నాడు. ఆ జాంబవంతుని పేరుమీద "జాంబవత్ప్రతిష్టగా" బుక్కరాయలు ఈ ఆలయాన్ని నిలిపాడు. ఈ బుక్కరాయలు "యదువంశానికి" చెందినవాడని "పెంచుకలదిన్నె శాసనంలో" ఉంది. యదువంశీయుడైన బుక్కరాయలు, జాంబవంతుని పేరుమీద విగ్రహ ప్రతిష్ఠ చేయడం ముదావహం. మరో విశేషం.. జాంబవతికీ – కృష్ణుడికీ జన్మించినవాడు "సాంబుడు" బుక్కరాయల వంశీయులు (కురుబలు) ఈ సాంబుని వంశపరంపర అని భావించడానిక్కూడా అవకాశముంది. ఆ జాంభవంతుడే పోతనగా అవతరించాడని మరో ప్రతిపాదన కూడా ఉంది.

## *ఇక చరిత్ర పరంగా చూస్తే...*

బ్రిటిష్ వారు నియమించిన భారతదేశపు మొదటి సర్వేయర్ జనరల్ “కల్నల్ కోలిన్ మెకంజీ” సేకరించిన “కైఫీయత్తుల” ప్రకారం “విజయనగర సామ్రాజ్యం” ఆవిర్భించేనాటికి ఈ ఒంటిమిట్ట లేదు. “బుక్క రాయలు” విజయనగర చక్రవర్తిగా ఉన్న కాలంలో, ఉదయగిరిని ఆయన సోదరుడైన “కంపరాయలు” పాలిస్తున్నాడు. క్రీ.శ. 1340 – 1355 ల ప్రాంతంలో నాటి ఉదయగిరి పాలకుడైన కంపరాయలు తన ఈ పరిసర ప్రాంతాల్లో పర్యటించి, చెరువు – ఆలయం నిర్మించాలని ఆదేశాలు జారీచేశారు. ఇక్కడ వెలసిన స్వామిని “రఘునాయకులు” అని పిలిచాడు. ఈ ఆలయ నిర్మాణానికి కంపరాయలు పూనుకొన్నా, ప్రారంభించింది మాత్రం బుక్కరాయలే. క్రీ. శ. 1356 లో “బుక్కరాయలు” తన “కాశీ – రామేశ్వర యాత్రలో” భాగంగా ఈ ఆలయంలో “సీతారామలక్ష్మణులు” కొలువైఉన్న

ఏకశిలా విగ్రహాన్ని నిలిపాడు. అప్పటికి కేవలం గర్భాలయం, అంతరాళం, ఆలయంపైన చిన్న గోపురం మాత్రమే ఉండేవి.

క్రీ.శ. 1590 – 1628 మధ్యకాలంలో రంగమండపం, మహా ప్రాకారం, తూర్పు, ఉత్తర, దక్షిణ దిక్కుల్లో ఎత్తైన గోపురాలను నిర్మించారు. విజయనగర సామ్రాజ్యంలో భాగంగా ఉన్న “సిద్ధవటం” ప్రాంతాన్ని పాలించిన “మట్లి రాజుల” పర్యవేక్షణలో విజయనగర చక్రవర్తుల ఆదేశానుసారం ఈ నిర్మాణాలు రూపుదిద్దుకొన్నాయి. “మట్లి అనంతరాజు” కాలంలో తూర్పు గోపురం & మహాప్రాకారం నిర్మితమయ్యాయి. తదనంతరకాలంలో, అనంతరాజు కుమారుడు “తిరువేంగళనాథరాజు” & మనుమడు “కుమార అనంతరాజు”ల కాలాల్లో ఉత్తర, దక్షిణ గోపురాల నిర్మాణం పూర్తయ్యింది.

ఈ ఆలయ ప్రధాన ద్వారమైన తూర్పుద్వారానికి లోపలివైపున విజయనగర చక్రవర్తి “సదాశివరాయల” పేరిట వేయించిన క్రీ.శ. 1555 & 1558 కాలంనాటి దానశాసనాలు ఉన్నాయి. ఇంకా వెలుగుచూడని శాసనాలు ఎన్నో ఉన్నట్లు చారిత్రక పరిశోధకులు చెబుతారు. ఒంటిమిట్ట చుట్టూ ఉన్న గ్రామాల ఆదాయం కూడా ఈ ఆలయానికే వచ్చేదాని కైఫీయత్తుల ద్వారా తెలుస్తోంది.

20వ శతాబ్దం ప్రారంభంలో “వాసుదాస స్వామి” పేరుతో ఆంధ్ర వాల్మీకి గా ప్రసిద్ధిగాంచిన “వావిలికొలను సుబ్బారావు” గారు షుమారు 24వేల పద్యాలతోకూడిన “మందరం” అన్న పేరుతో రామాయణాన్ని తెలుగులో వ్రాసింది ఇక్కడే. వీరు పోతన నివసించిన ఇంటిలోనే నివసించారు. పోతనగారి విగ్రహం ప్రక్కనే మనకు వీరు వ్రాయించిన శాసనం ఉంది. నూటఎనిమిది మార్లు వాల్మీకి రామాయణ పారాయణమును పూర్తిచేసి , తాను వ్రాయబోయే “మందరము” అనబడే రామాయణ తెలుగు వ్యాఖ్యానానికి పూర్వాంగముగా హరిద్వారు మొదలుకొని సింధూ బ్రహ్మపుత్ర పర్యంతము గల అయిదవందల దివ్య తీర్థములతో కోదండరామునకు సహస్ర ఘటాభిషేకము చేసి, మిత్రులతోడ్పాటుతో కనకరత్న కిరీటములను సమర్పించి, శ్రీరామ పట్టాభిషేక మహా యజ్ఞమును ఏభైవేలమంది సమక్షంలో జరిపించినట్లు వేయించిన శాసనమిది.

ఎందరో మహానుభావులు ఈ కోదండరాముణ్ణి సేవించి పునీతులయ్యారు. అయ్యలరాజు తిప్పయ్య, “రామాభ్యుదయం” వ్రాసిన అయ్యలరాజు రామభద్రుడు, ఉప్పుగొండూరు వెంకటకవి, “కోదండరామ శతకం” వరకవి అయ్యప్ప, భవనాసి మాల ఓబన్న, వంటి ఇంకా ఎందరో కవులు ఈ కోదండరాముణ్ణి సేవించి గొప్ప రచనలు చేశారు. 1670 ప్రాంతంలో కడప నవాబు ప్రతినిధి “ఇమాంబేగ్” ఇక్కడికొచ్చి స్వామి మహిమలతో రామభక్తుడై సేవించుకొన్నారు. 1652 లో “టావెర్నియర్” అనే ఫ్రెంచ్ యాత్రికుడు మనదేశాన్ని సందర్శించినపుడు ఈ ఆలయాన్ని దర్శించుకొని ఇదొక అద్భుత కళాఖండమని గొప్పగా రాసుకొన్నాడట.. “థామస్ మన్రో” కలెక్టర్ గా ఉన్నకాలంలో ఈ ఆలయానికి ఆర్థిక సహాయం అందుతుండేదట..

## శిల్పకళ...

ఇక ఈ ఆలయం యొక్క శిల్పకళ గురించి ఎంతచెప్పుకొన్నా తక్కువే.. పూర్తి విజయనగర శైలిలో నిర్మించారు. ఒకే మహా ప్రాకారంతో నిర్మించిన ఈ ఆలయానికి తూర్పు, ఉత్తరం, దక్షిణ దిశల్లో మూడు గాలిగోపురాలున్నాయి. గర్భాలయం, ముఖమండపం, ప్రాకారం అన్న మూడుభాగాలుగా ఈ ఆలయాన్ని విభజించవచ్చు. గర్భాలయానికి అభిముఖంగా, ముఖమండపంలో శిల్పకళా శోభితమైన గరుడాళ్వార్ సన్నిధి ఉంది. ప్రాకారం లోపల కల్యాణమండపంతో పాటు మరి రెండు మండపాలు కూడ మనకు కన్పిస్తాయి. వాటి లో ఒకటి రాయలవారి ఎదుర్కోలు మండపం గా చెప్పబడుతోంది. తూర్పువైపున ఉన్న ప్రధానమైన గాలిగోపురం రమణీయమైన శిల్పకళతో చూడముచ్చటగా ఉంటుంది. మన పురాణేతిహాసాల్లోని పలు సంఘటనలను అద్భుతంగా మలచారు. ఇక విజయనగర ఆలయాల్లో ఉండే పోర్చుగీస్ వార్తలుకు, వారి గుర్రాలూ షరామామూలే.. అన్నీ శిల్పాల్లో జీవం ఉట్టిపడుతుంది. అసలు అంత కఠినమైన శిలను మైనం ముద్దమీద మలచినట్లు ఎలామలచారో ఊహకందదు. నేటి కంప్యూటర్ గ్రాఫిక్స్ తరహాలో చెక్కారు .....

ధ్వజస్తంబాన్ని ఆనుకొని ఉండే ముఖమండపం, పూర్తి విజయనగర శైలిలో నిర్మించారు. చూడగానే హంపీలోని విట్టల ఆలయంలోని మండపాలు గుర్తుకొస్తాయి. ముప్పైరెండు బలమైన స్థంభాలతో ఈ మండపాన్ని నిర్మించారు. ప్రతి స్థంభమూ అత్యద్భుతమైన శిల్పకళతో మనోహరంగా, చూపు తిప్పుకోనీకుండా చేస్తాయి. ఇవన్నీ ఇన్నేళ్ల తరువాత కూడ చెక్కుచెదరకుండా ఉండటం గొప్పవిషయం. ఈ మండపంలో ఏవైపుకి చూసినా ఆద్యంతమూ శిల్పకళా శోభితమే. చూడడానికి రెండుకళ్ళు చాలవు.

ప్రతిఒక్కరూ ఖచ్చితంగా చూసితీరవలసిన ఆలయం ఇది. ఎన్నెన్నో అద్భుతామైన శిల్పాలున్నాయి...

ఈ ఒంటిమిట్ట గ్రామం కడప-తిరుపతి రహదారిపై కడపనుంచి 26 కి.మీ.దూరంలో ఉంది.